సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



పరిహారం.. పరిహాసం

నెల్లూరు జిల్లాలోని సోమశిల రిజర్వాయర్ బ్యాక్ వాటర్ ముంపు ప్రాంతాలకు పరిహారం పంపిణీ పరిహాసంలా మారింది. నాలుగున్నర దశాబ్దాలు అవుతున్నా పూర్తి కాలేదు - IIలో



చెట్లు నరికి. అక్రమంగా తరలింపు

గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లె గ్రామానికి సమీపంలోని శ్రీ రెడ్డెమ్మ కొండ పరిసరాల్లో ఉన్న కొండల్లోని చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్నారు. - IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.360
రెండోరకం	రూ.200	రూ.290

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 154 మెట్రిక్ టన్నులు



వేదన.. పెల్లుబికిన నిరసన

అర్జీదారుల వేదన తీరడం లేదు. 'దరఖాస్తులు కొండంత.. పరిష్కారం గోరంత' అనే చందంగా పరిస్థితి తయారైంది. వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్ వరకూ వచ్చి వినతిపత్రం ఇచ్చినా మళ్లీ రావాల్సి వస్తోంది. వాస్తవానికి మండల, డివిజన్ స్థాయిలో కూడా అర్జీలు సమర్పించవచ్చు. కానీ, అష్టకష్టాలూ పడి కలెక్టర్ వరకూ వస్తున్నా.. పరిష్కారం కాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- సమస్యలతో సతమతమవుతున్న జనం
- పరిష్కారం కాక ఆందోళన
- కలెక్టరేట్‌కు పరుగులు
- కూటమిపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత



కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న వీఆర్‌ఏలు

సాక్షి రాయచోటి : ప్రజలకు అనేక హామీలు ఇచ్చి పట్టించుకోకపోవడంతో అన్ని వర్గాలు తిరుగుబాటు బావుటా ఎగుర వేస్తున్నాయి. 'అది చేస్తాం.. ఇది చేస్తాం' అని చెప్పి.. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మమ అనిపిస్తుండడంతో నిరసన గళం వినిపిస్తున్నారు. ఆక్రమణల పర్వంపై ప్రజలు, భూకబ్జాలపై బాధితులు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఉద్యోగులు, సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏలు ఇలా అన్ని వర్గాలు రోడ్డెక్కుతున్నాయి. ప్రతి సోమవారం కూటమి సర్కార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు బాధితులు బారులు తీరుతున్నారు. ఎక్కడికక్కడ సమస్యలు పేరుకుపోతుండటం... తీర్చే వారు కనిపించకపోవడంతో కలెక్టరేట్ వైపు కదులుతున్నారు. మరోపక్క ప్రభుత్వంపై పలు వర్గాలు ఆందోళనకు పిలుపునిస్తున్నాయి.

వీఆర్‌ఏల డిమాండ్లు నెరవేర్చాలి

అన్నమయ్య జిల్లాలోని వీఆర్‌ఏల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఏపీ వీఆర్‌ఏల సంఘం ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప ఆధ్వర్యంలో సుమారు 30 మంది వీఆర్‌ఏలు తమ డిమాండ్ల సాధనకై ఉద్యమించారు. విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల రాష్ట్ర పిలుపు మేరకు ఇప్పటికే తహసీల్దార్, ఆర్డీఓ, సబ్ కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నిరసన తెలియజేశామని, ఇప్పుడు కలెక్టరేట్ వద్ద ఉద్యమించినట్లు వివరించారు. వీఆర్‌ఏలకు సంబంధించి వెంటనే పే స్కేలు అమలు చేయాలని, రాత్రిపూట నైట్ డ్యూటీలు తప్పించాలని నినందించారు. అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, వీఆర్‌ఏల సర్వీసులను పర్మినెంట్ చేయాలని, రికవరీ చేసిన డీఏలను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసనలు వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద కొద్దిసేపు నినాదాలు చేశాక లోనికి వెళ్లి జిల్లా జాయింట్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

మెడికల్ కళాశాలల్లో పీపీపీ విధానాన్ని రద్దు చేయండి : ఏఐటీయూసీ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐయూటీసీ నాయకులు

రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన మెడికల్ కళాశాలల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా వైద్య విద్యను పీపీపీ పద్ధతిలో నిర్వహించాలని కూటమి ప్రభుత్వం తీసుకుందని, ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విలువైన ప్రజాధనాన్ని ప్రైవేట్ వారికి అతి చౌకగా కట్టబెట్టే పీపీపీ విధానం వైద్యరంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించడంలో భాగమని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో ప్రారంభమైన కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. కళాశాలల ప్రైవేటీకరణకు జారీ చేసిన పీపీపీ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కబ్జాదారుల నుంచి చెరువును రక్షించాలి

మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె గ్రామంలోని ఓటు కుంట చెరువును అక్రమార్కులు కబ్జా చేశారని, వారి బారి నుంచి చెరువును కాపాడాలని గ్రామస్తులు కోరారు. గత ప్రభుత్వంలో రీ సర్వే చేశారని, అయితే సర్పంచులు, వీఆర్‌ఓలు సక్రమంగా సర్వే చేయించకుండా రైతులకు 1బి అడంగల్ రాకుండా చేశారన్నారు. డీకేటీ భూములకు ఇప్పటికీ కూడా 1బీ రావడం లేదన్నారు. 50 ఏళ్ల కిందట ఇచ్చిన భూములను ప్రభుత్వ భూమిగా మార్చారన్నారు. ఆయా భూములకు 1బీ అడంగల్ వచ్చేలా చేయాలని కోరారు.

కదం తొక్కిన కరెంటు ఉద్యోగులు



సమస్యల పరిష్కారానికి ఆందోళన నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

అన్నమయ్య జిల్లాలోని విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు కదం తొక్కారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యచరణ సమితి (జేఏసీ) అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు వందలాదిగా తరలివచ్చి డిమాండ్లపై నినదించారు. రాయచోటి పట్టణంలోని చిత్తూరురోడ్డులో శివాలయం సమీపంలో ఉన్న విద్యుత్ కార్యాలయం నుంచి ప్లకార్డులు చేతబూని, బ్యానర్లతో ముందుకు సాగుతూ వందల సంఖ్యలో ఉద్యోగులు డిమాండ్లతో కదిలి వచ్చారు. ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వెంటనే రెండు డీఏలు అందించి ఆదుకోవాలని, అంతేకాకుండా ఇతర అనేక డిమాండ్లతో మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారిపై ఠాణా, మాసాపేట మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన గళం వినిపించారు. పెద్ద ఎత్తున శాంతియుత ర్యాలీ పేరుతో ఇతర కార్యక్రమాలు చేపడుతూ కలెక్టరేట్ వద్ద నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ఆ సంఘం నాయకులు, జేఏసీ ప్రతినిధులు డీఆర్వో మధుసూదన్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు.

వంకకు రక్షణ గోడ నిర్మించాలి



సుండుపల్లె మండలం పత్తివాండ్లపల్లె సమీపంలో ఉన్న తుమ్మాని వంక

సుండుపల్లె మండలం పత్తివాండ్లపల్లె సమీపంలో ఉన్న తుమ్మాని వంకకు రక్షణ గోడ నిర్మించి పత్తివాండ్లపల్లె ప్రజల ప్రాణాలు కాపాడాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన జేసీకి సమస్యను విన్నవించారు. గత పక్షం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా తుమ్మాని వంకకు వరదలు వచ్చి రక్షణగా ఉన్న మట్టికట్ట(కరకట్ట)కు గండిపడి లోతట్టుగా ఉన్న పత్తివాండ్ల పల్లె గ్రామంలోని గృహాల్లోకి వరద నీరు చేరి ప్రజలకు ఆస్తినష్టం వాటిల్లిందన్నారు. కోళ్లు వరదలో కొట్టుకు పోయాయని ఆయన పేర్కొన్నారు. ఆ రోజు రాత్రి అంతా ప్రజలంతా బిక్కుబిక్కుమని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉన్నారని పేర్కొన్నారు. ఇటీవల నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మళ్లీ గ్రామంలోకి వంకనీరు ప్రవహిస్తుందని తెలిపారు. వంకనీరు వ్యవసాయ భూములు మీద పడి ప్రవహిస్తూ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తుమ్మాని వంకకు రక్షణ గోడ (ప్రొటెక్షన్ వాల్) నిర్మించాలని, రోడ్లు, బ్రిడ్జిలకు మరమ్మతులు వెంటనే చేసి ప్రజల అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగు సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

న్యూస్‌రీల్

యూరియా వాడకం తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ

చిన్నమండెం : రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి నానో ఎరువులు, జీవన ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ సూచించారు. సోమవారం చిన్నమండెంలో వ్యవసాయ శాఖ, ఇఫ్కో సహకార సంస్థ వారి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ సమావేశం, మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యూరియా వాడకం వల్ల పర్యావరణంపై కలిగే నష్టాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి గీత, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్షణగోడ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : గుంజనేరు రక్షణ గోడ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రక్షణ గోడ నిర్మాణ పనులను పరిశీలించి, గుత్తేదారుతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తున్నాయన్నారు. గుంజనేరు నది పరీవాహక ప్రాంతాల్లో వర్షం కురిస్తే యేరు ఉధృతంగా ప్రవహిస్తుందని, దీంతో కోడూరు పట్టణం, సరసరాం పేట తదితర ప్రాంత ప్రజలు ముంపునకు గురి కాకూడదు అనే దృష్టితో గత ప్రభుత్వంలో రక్షణగోడను మంజూరు చేయించామన్నారు. అలానే వందల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరిపామన్నారు. కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేయకుండా చిత్తశుద్ధితో వ్యవహరించి పనులు పూర్తి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, శివయ్య, ఎంపీటీసీ మహేష్, దుర్గయ్య, వెంకటరెడ్డి, రమణ, రాజగోపాల్, కృష్ణారెడ్డి, వినోద్, రఘు, మణి తదితర నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో రోడ్డు నిర్మాణం

పెనగలూరు : మండలంలోని ఎస్‌ఆర్ పురం పంచాయతీ పల్లంపాడు గ్రామానికి చెయ్యేరు నదిపై రోడ్డు వేస్తామని జెడ్పీటీసీ సుబ్బరాయుడు అన్నారు. సోమవారం జెడ్పీటీసీ సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణిలు చెయ్యేరు నదిపై తెగిపోయిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ విజయరెడ్డిల ఆదేశాల మేరకు ఈ రోడ్డును పరిశీలించడం జరిగిందన్నారు. జెడ్పీ నిధులు ద్వారా ఈ రోడ్డును వేసేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. చెయ్యేరు నదిపై రోడ్డు వేసేటప్పుడు సిమెంటు బొంగులు ఏర్పాటు చేసి రోడ్డు వేస్తామని చెప్పారు. రోడ్డు నిర్మాణం విషయమై అజయ్‌రెడ్డి, విజయ్‌రెడ్డిలతో చర్చించినట్లు జెడ్పీటీసీ తెలియజేశారు.

అధికారమే అండ.. కరుగుతున్న కొండ

అధికార పార్టీ నేతలు బరితెగిస్తున్నారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ కొండలను కరగదీస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే భారీ పేలుళ్లకు పాల్పడుతున్నారు. సమీప గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. అయినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

- మంగంపేట గనుల సమీపంలో అక్రమ మైనింగ్
- జాతీయ రహదారి పక్కనే పేలుళ్లు
- ఆందోళనలో ప్రయాణికులు, సమీప గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



మంగంపేట ఏపీఎండీసీ గనుల సమీపంలో అక్రమ మైనింగ్



జాతీయ రహదారి పక్కనే పెద్ద ఎత్తున లేచిన దుమ్ము దూళి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట ముగ్గురాయి ఖనిజం వంద మీటర్లలోపు భారీస్థాయిలో డ్రిల్లింగ్ నిర్వహించి స్థానిక టీడీపీ నాయకుడు అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నాడు. జాతీయ రహదారి పక్కనే భారీ పేలుళ్లకు అనుమతులు అధికారులు ఎలా ఇచ్చారని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల నిర్వహించిన బ్లాస్టింగ్‌తో పెద్ద శబ్దాలు రావడంతో అటువైపు వెళ్తున్న వాహనదారులు, ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. దుమ్ము, దూళితో దట్టమైన పొగలు అల్లుకున్నట్లు ఉండటంతోపాటు రాళ్లు తమపైన పడతాయోమేనని భయాందోళన చెందుతున్నారు. ఈ పేలుళ్లధాటికి గతంలో కొండపై నుంచి బండరాయి జాతీయ రహదారిపైకి దొర్లుకుంటూ వచ్చి పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో.. పెద్ద ప్రమాదమే తప్పింది. ఏపీఎండీసీ అధికారులు బండరాయిని తొలగించారు.

దేంజర్ జోన్‌లో ఎలా అనుమతిస్తారు?

మంగంపేట ఏపీఎండీసీ గనుల నుంచి 500 మీటర్ల వరకు డేంజర్ జోన్‌గా ప్రకటించారు. అయితే వందమీటర్ల లోపు భారీ ఎత్తున డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ ఎలా అనుమతించారని, అక్రమంగా మైనింగ్ జరుగుతుంటే అధికారులు ఏ విధంగా చూస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏపీఎండీసీ అధికారులు ఐదువందల మీటర్ల డేంజర్ జోన్‌లో ఈ కంకర మైనింగ్‌కు ఏ విధంగా అధికారులు మినహాయింపు కల్పించారని ప్రశ్నిస్తున్నారు.

గ్రామాల ప్రజలు ఆందోళన

జాతీయ రహదారి పక్కనే మైనింగ్‌లో పెద్ద ఎత్తున కంప్రెసర్‌తో ప్రస్తుతం బ్లాస్టింగ్ కోసం పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. బ్లాస్టింగ్ నిర్వహిస్తే ఏమి జరుగుతుందోనని సమీప గోవిందంపల్లి గ్రామ ప్రజలు, జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఏపీఎండీసీ నుంచి వచ్చే వాయు కాలుష్యంతో ప్రజలు అల్లాడుతుంటే.. కంకర క్వారీ కోసం అక్రమంగా మైనింగ్ చేస్తూ ఉండటంతో కాలుష్యం పెరిగి ఇబ్బందులు పడుతున్నామని గోవిందంపల్లి గ్రామ ప్రజలు గతేడాది నుంచి అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. దీంతో అప్పటి జిల్లా ఎస్పీ బ్లాస్టింగ్‌కు అనుమతి ఇవ్వలేదు. ఆయన బదిలీపై వెళ్లగానే స్థానిక టీడీపీ నాయకుడు మరలా పెద్దఎత్తున బ్లాస్టింగ్ నిర్వహించేందుకు పనులు చేస్తున్నాడు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

ఇలాగే బ్లాస్టింగ్ కారణంగా బద్వేలు నియోజకవర్గం కలసాపాడులో అనేక మంది మృతి చెందారు. ఇటువంటి బ్లాస్టింగ్‌ల ద్వారా ప్రాణాలకు ప్రమాదం ఉందని తెలిసినా అధికారులు ఏ విధంగా అనుమతులు ఇస్తున్నారని గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రస్తుతం కంకర కోసం అక్రమంగా బ్లాస్టింగ్ చేసేందుకు నిర్వహిస్తున్న పనులను అడ్డుకోవాలని గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

రేషన్ పంపిణీలో న్యాయం చేయండి

– సబ్ కలెక్టర్‌కు బాధితుల వినతి

రాజంపేట : తమకు రేషన్ పంపిణీలో న్యాయం చేయాలని బాధితులు కోరారు. సోమవారం రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభా భవనంలో సబ్‌కలెక్టర్ భావన అధ్యక్షతన పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోనల్ బూత్ కమిటీ కన్వీనర్, గుంతకల్ రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కాపుపల్లె, అగ్రహారం దళితవాడ, అరుంధతివాడ గ్రామస్తులు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగంపేట గ్రామ సచివాలయం తమ ప్రాంతాలకు నాలుగు కిలోమీటర్ల దూరం ఉందని వివరించారు. తమ గ్రామంలోనే చౌకదుకాణం బియ్యం పంపిణీ చేయాలని కోరారు. అలాగే మంగంపేట డేంజర్ జోన్‌లో ఆర్ అండ్ ఆర్-5 ఉన్నందు వల్ల కొత్తగా రావాల్సిన నష్టపరిహారాలు, పెండింగ్‌లోని పరిహారం సమస్యను పరిష్కరించాలని తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి సబ్‌కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో గల్లా శ్రీనివాసులు, కొలూరి రఘురామిరెడ్డి, చిన్నకృష్ణారెడ్డి, మడగల రాజయ్య, ముద్ద వెంకటసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, జంపయ్య, సిద్దారెడ్డిపల్లె, రామచంద్రారెడ్డి, రమణ, వెంకటేష్, గోపినాథరెడ్డి, మంగంపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

జగన్మాతా.. నమోస్తుతే!

'అమ్మలగన్న అమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ.. మాయమ్మ పెద్దమ్మ'.. అంటూ జగన్మాతకు ప్రణమిల్లారు. జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రులు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో ఆలయాలు శోభిల్లాయి. తొలి రోజు అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. సిరులతల్లిని దర్శించుకున్న భక్తులు పరవశించి పోయారు. 'చల్లగా చూడమ్మా' అంటూ వేడుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట టౌన్ : అమ్మవారి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు



రాయచోటి : వీరభద్రస్వామి దేవస్థానంలో భద్రకాళి అమ్మవారు



గుర్రంకొండ: బాలాత్రిపుర సుందరీదేవిగా రెడ్డెమ్మతల్లి



రైల్వేకోడూరు : దీక్షాబంధన అలంకారంలో వాసవీకన్యకాపరమేశ్వరీదేవి



తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై ప్రత్యేక అలంకరణలో ఏనుగుమల్లమ్మ



మదనపల్లె : హంసవేణి అలంకారంలో వాసవీదేవి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రామకృష్ణ (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : రాజంపేట మండలం ఊటుకూరు ప్రధాన రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడూరు మండలం బొజ్జవారిపల్లి గ్రామానికి చెందిన లకిడి రామకృష్ణ (50) మృతి చెందాడు. బద్వేలులో ఉన్న బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంలో రామకృష్ణ బయలుదేరాడు. ఊటూరువద్ద పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టు మార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితంలేని వ్యక్తి వీరంగం


రాజంపేట ప్రాంతీయవైద్యశాల వద్ద సుధాకర్‌ను తాళ్లతో కట్టేసిన దృశ్యం

రాజంపేట : రాజంపేట స్టేట్‌బ్యాంక్ సమీపంలో మతిస్థిమితం లేని సుధాకర్ అనే వ్యక్తి సోమవారం వీరంగం సృష్టించాడు. పలువురిపై దాడి చేసిన క్రమంలో స్థానికులు పట్టుకొని కాళ్లు చేతులు కట్టేశారు. భార్యపై అనుమానంతో తన కొడుకు మతిభ్రమించిందని సుధాకర్ తల్లి ఆవేదన చెందారు. పోలీసులు రంగం ప్రవేశం చేశారు. మతిస్థిమితంలేని వ్యక్తి ఆసుపత్రిలో చేర్పిన క్రమంలో విచారణ చేశారు.

పనిచేస్తుండగా విద్యుత్ సరఫరా: ఒకరికి గాయాలు

బి.కొత్తకోట : విద్యుత్ పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత శుక్రవారం మండలంలోని తుమ్మనంగుట్టకు గౌస్‌పీర్ (19) కోటావూరు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సంబంధించి విద్యుత్ స్తంభంపై జంపర్ల పనులు చేస్తున్నాడు. అంతకుముందు వరకు విద్యుత్ సరఫరా నిలిపి ఉండగా ఒక్కసారిగా సరఫరా పునరుద్ధరణ అయ్యింది. దీంతో గౌస్‌పీర్ షాక్‌కు గురయ్యాడు. బాధితున్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై డిస్కం ఏడీ గోవిందరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ తన సిబ్బందితో పనులు చేయిస్తుండగా ఈ ఘటన జరిగిందని చెప్పారు. విద్యుత్ సరఫరా నిలిపి ఉండగా మళ్లీ ఎలా సరఫరా వచ్చింది, ప్రమాద ఘటనపై ఏఈ విచారించి నివేదిక ఇస్తారని చెప్పారు. ఈ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి..


తీవ్రంగా గాయపడిన పల్లవి

మదనపల్లె రూరల్ : ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. చింతపర్తికి చెందిన సత్యనారాయణ, మరో బాలిక పల్లవి(5)తో కలిసి ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై వెళుతుండగా, బైపాస్‌రోడ్డులోని అరేబియన్ హోటల్ సమీపంలో మరో బైక్ ఎదురుగా వచ్చి ఢీకొనడంతో గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాలిక తీవ్రంగా గాయపడటంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పరిహారం.. పరిహాసం

- సోమశిల బ్యాక్ వాటర్ గ్రామాలకు పూర్తి కాని పంపిణీ
- నాలుగున్నర దశాబ్దాలుగా కొనసాగుతున్న వైనం
- ఏటా ముంపునకు గురవుతున్న పొలాలు
- అష్టకష్టాలు పడుతున్న బాధితులు


ముంపు గ్రామాల వద్దకు వచ్చిన సోమశిల వెనుక జలాలు

జలాశయం	సోమశిల
పూర్తిసామర్థ్యం	77.988 టీఎంసీలు
ప్రస్తుతం నీటిమట్టం	99.857 మీటర్లు
ప్రస్తుత కెపాసిటీ	72.690 టీఎంసీలు
ఇన్‌ఫ్లో	12649 క్యూసెక్కులు
బ్యాక్‌వాటర్ ప్రభావిత మండలాలు	నందలూరు, గోపవరం, ఒంటిమిట్ట, అట్లూరు, పెనగలూరు


పెనగలూరు మండలంలో నీట మునిగిన వరిపంట

రాజంపేట/పెనగలూరు : సోమశిల జలాశయం బ్యాక్‌వాటర్ (వెనుక జలాల) ముంపు పరిహారం పరిహాసంలా మారింది. దశాబ్దాలుగా కొనసాగుతున్నా.. పూర్తి స్థాయిలో చెల్లించలేదు. దీంతో బాధితులు గ్రామాలకు వదలలేక.. ఏటా ముంపునకు గురవుతున్నారు. ఇంకెన్నాళ్లు పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి వేదన అరణ్య రోదనగా మారింది. విధిలేని పరిస్థితుల్లో న్యాయస్థానంవైపు అడుగులు వేస్తున్నారు. పరిహారం విషయంలో అనేక విధాలుగా.. పలు మార్లు హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికీ కేసులు కొనసాగుతున్నాయి. కొందరికి కోర్టు అనుకూల తీర్పులు ఇచ్చింది. మరికొన్ని కేసులు పెండింగ్‌లో న్నాయి.

ముంపు గ్రామాలు

నెల్లూరు జిల్లాలోని పెన్నా నదిపై సోమశిల జలాశయం నిర్మాణం 1979 నుంచి ప్రారంభమైంది. 1981లో రిజర్వాయర్ అందుబాటులోకి వచ్చింది. 1986కి పూర్తయింది. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో నందలూరు, ఒంటిమిట్ట, పెనగలూరు, గోపవరం, ఒంటిమిట్ట మండలాల్లో సోమశిల ముంపు గ్రామాలు ఉన్నాయి. 1979 నుంచి జలాశయం వెనుకజలాలతో మునకకు గురయ్యే గ్రామాలను గుర్తించి దశలవారీగా పరిహారం చెల్లిస్తూ వచ్చారు. సోమశిల వెనుకజలాల కింద 130 గ్రామాలు మునకకు గురవుతున్నాయి. రాజంపేటలో సోమశిల స్పెషల్ డిప్యూటీ కార్యాలయం కూడా ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని గ్రామాలకు పరిహారం పంపిణీ చేసి ఖాళీ చేయించారు. అయితే అనేక కారణాలతో పరిహారం పంపిణీ పెండింగ్‌లో ఉండిపోయింది. జలాశయంలో పూర్తి స్థాయిలో (77.988 టీఎంసీ)నీటి నిల్వ ఉంచలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. ప్రస్తుత నీటిమట్టం 99.857 మీటర్లలో ఉంది. ఇన్‌ఫ్లో 12649 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రహసనంలా..

ఉమ్మడి కడప జిల్లాలోని నందలూరు, ఒంటిమిట్ట, గోపవరం, అట్లూరు, పెనగలూరు మండలాల్లోని ముంపు గ్రామాలకు సకాలంలో పరిహారం పంపిణీ చేయలేకపోయారు. ప్రస్తుతం జలాశయంలో 72.25 టీఎంసీలు ఉండగా.. ముంపుగ్రామాలకు నీరు చేరింది. నందలూరు మండలం పొత్తపి, నూకినేనిపల్లె, పెనగలూరు మండలం సిరవరం, ఎస్ఆర్‌పురం గ్రామాల పరిధిలో 296 ఎకరాల్లో సాగుచేసిన పంటలు నీట మునిగాయి. అధికారులు కూడా గుర్తించారు. భూసేకరణ చేయాలనే ప్రతిపాదన అటకెక్కించారు. సోమశిల అధికారులు కన్సెంట్ అవార్డు చేసి, ఒకేసారి పరిహారం చెల్లింపులు జరిపి ఉంటే ఇప్పుడు పరిహారం పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తేవి కాదని ముంపు బాధితులు చెబుతున్నారు.

భూములకు పరిహారం.. గ్రామానికి ఏదీ?

ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామానికి పరిహారం ఇవ్వలేదు. వారికి జీవనాధారమైన పంట పొలాల్లో వెనుకజలాలు తిష్ట వేసి ఉన్నాయి. పరిహారం ఇచ్చేస్తే ఖాళీ చేసి వెళ్లిపోతామని ముంపు బాధితులు కోరుతున్నప్పటికీ.. ప్రభుత్వం వారి మాట పెడచెవిన పెడుతోంది. ఇదే పరిస్థితి నందలూరు మండలంలోని పొత్తపి గ్రామంలో కూడా నెలకొని ఉంది. ఈ విధంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ముంపు గ్రామాల్లో రైతులు తమ భూములకు పరిహారం రాక.. మరికొందరు గ్రామాలకు అందక ఇబ్బంది పడుతున్నారు.

పూర్తి సామర్థ్యంలో నీళ్లు పెడితే..

సోమశిల జలాశయంలో 77.988 టీఎంసీల నీటి నిల్వ పెడితే ఉమ్మడి కడప జిల్లాలోని ముంపుగ్రామాలతోపాటు సమీప పొలాలు మునిగిపోతాయి. గతంలో అనేక మార్లు ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. జలాశయం పూర్తిసామర్థ్యం వరకు రాకుండా, ముంపుగ్రామాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకొని నీటి విడుదల విషయంలో అడుగులు వేస్తున్నారు.

నాలుగున్నర దశాబ్దాలుగా..

నాలుగున్నర దశాబ్దాలుగా ముంపుగ్రామాలకు పరిహారం పంపిణీ కొనసాగుతూనే ఉంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ముంపు బాధితులకు న్యాయంగా పరిహారం అందజేసేందుకు కడపలో లోక్ అదాలత్ ద్వారా ఒకేసారి సెటిల్‌మెంట్ చేసే విధంగా నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో రూ.330 కోట్లకు పైగా పరిహారాన్ని బాధితులకు అందజేసేందుకు చర్యలు తీసుకున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని సోమశిల ముంపు బాధితులు గుర్తు చేసుకుంటున్నారు.

నీటిని దిగువకు పంపుతాం

సోమశిల వెనుకజలాలు తగ్గుముఖం పట్టాయి. వెనుకజలాల వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్యాం నీటిని దిగువకు పంపుతాం.

– శ్రీనివాసులు, ఈఈ, సోమశిల జలాశయం

చేతికొచ్చే పంట నీట మునిగింది



మరో వారం రోజుల్లో చేతికి వచ్చే పంట సోమశిల బ్యాక్ వాటర్‌తో నీట మునిగింది. ఒక ఎకరం వరి పండించాలంటే రూ. 30 వేల ఖర్చు వస్తుంది. నీటిలో పంటను కోసేందుకు వీలు పడటం లేదు. వెంటనే ప్రాజెక్టు నీరు కిందికి వదిలి రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలి.

– కానాల చంద్ర, రైతు, సిరివరం, పెనగలూరు మండలం

పరిహారం చెల్లించాలి



గ్రామంలో కొంతమందికి మాత్రమే పరిహారం ఇచ్చారు. మేము పంటలు సాగుచేసుకుంటే ప్రతి ఏడాది సోమశిల బ్యాక్ వాటర్ రావడంతో మునిగిపోతున్నాయి. నష్టపోతున్నాం. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. 1.20 ఎకరాల వరిపంట మునిగిపోయింది. పంట కోసే వరకు ప్రాజెక్టులో నీటిని తగ్గించాలి. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలి.

– చెంగల్ రాయుడు, రైతు, సిరివరం

బాధితులకు న్యాయం చేయాలి

జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి


వృద్ధుల వద్దకు వెళ్లి అర్జీలను స్వీకరిస్తున్న ఎస్పీ ధీరజ్ కనుబిల్లి

రాయచోటి : అర్జీదారుల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు యంత్రాంగం సత్వర చర్యలు చేపట్టాలని, వారికి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి పేర్కొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ స్వయంగా అర్జీలు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదు నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, వికలాంగులు, మహిళల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. నడవలేని స్థితిలో ఉన్న బాధితుల వద్దకు ఎస్పీ వెళ్లి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు ఎలాంటి సమస్య అయినా భయపడకుండా పోలీసు వద్దకు రావాలని ఎస్పీ సూచించారు.

పొలం యజమానిపై హత్యాయత్నం

మైదుకూరు : గొర్రెలు మేపుకునే విషయంలో తగాదా ఏర్పడి మండలంలోని శ్రీరామ్ నగర్‌కు చెందిన ఆవుల గురవయ్య పై అదే గ్రామానికి చెందిన ఆదినారాయణ హత్యాయత్నం చేసినట్టు అర్బన్ సీఐ కె. రమణారెడ్డి తెలిపారు. జీవి సత్రంలోని శ్రీరామ్ నగర్ కు చెందిన ఆవుల గురవయ్యకు చెందిన బెండ తోటలో శనివారం ఆదినారాయణకు చెందిన గొర్రెలు మేస్తుండగా అడ్డుకోవడంతో వారి మధ్య గొడవ ఏర్పడినట్లు సీఐ పేర్కొన్నారు. ఆ మేరకు ఆదినారాయణ మచ్చు కత్తితో గురవయ్య పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడినట్టు తెలిపారు. సంఘటనకు సంబంధించి ఆదినారాయణపై సోమవారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

ఉచిత న్యాయ సేవలు పొందాలి


సబ్ జైలులో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బాబా ఫక్రుద్దీన్

రాయచోటి : జైలులోని ఖైదీలు మంచి ఆరోగ్యంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత న్యాయ సలహాలను పొందాలని కడప జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫకృద్దీన్ తెలిపారు. ఏపీ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు డాక్టర్ సి యామినీ ఆదేశాల మేరకు రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జైలులో రిజిస్టర్లను పరిశీలించారు.. ఖైదీలకు లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌ను వివరించారు. ఖైదీలతో ఒక్కొక్కరిగా మాట్లాడి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబరు 15100పై వారికి తెలియజేశారు. సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


రాయచోటిలో కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

రాయచోటి జగదాంబసెంటర్ : వివిధ కారణాలతో చనిపోతున్న న్యాయవాదులకు సంవత్సరంలో ఏదో ఒక రోజు ఉదయం కోర్టు పనిగంటల్లో సంతాపాన్ని తెలిపే సంస్కృతిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రద్దు చేయడాన్ని న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదులుఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుయోధనతో కలిసి విధులు బహిష్కరించడానికి గల కారణాలను తెలియజేసిన అనంతరం కోర్టు మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డిబాషా మాట్లాడుతూ ఇప్పటి వరకు వివిధ కారణాలతో చనిపోయిన న్యాయవాదులకు సంవత్సరంలో ఏదో ఒక రోజున ఉదయం. 10.30 గంటలకు సంతాపాన్ని తెలియజేసే సంస్కృతి ఎప్పటి నుంచో ఉందని తెలిపారు. రాష్ట్ర హైకోర్టు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసిందని అన్నారు. దీనిని తక్షణం వెనక్కి తీసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య, కడప జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆది వర్సెస్ సీఎం రమేష్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఇది నా అడ్డా. ఇక్కడ నేను తప్ప ఎవరూ పనులు చేయకూడదు. కాదని చేస్తే దాడులు తప్పవనే సంకేతాలను ఆది వర్గం సీఎం రమేష్ నాయుడుకు పంపుతోంది. ఇప్పటికే టి.కోడూరు వద్ద అదాని గ్రూప్ కంపెనీకి చెందిన పవర్‌ప్లాంట్ పనులు సబ్ కాంట్రాక్టర్ కింద సీఎం రమేష్ నాయుడు కంపెనీ చేజిక్కించుకోగా ఎమ్మెల్యే ఆది వర్గం కంపెనీకి చెందిన ప్రతినిధులు, అధికారులపై దాడులు చేసి భయంభ్రాతులకు గురి చేశారు.

గండికోట టూరిజం అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పిలిచిన టెండర్లను రూ.78 కోట్లతో రిత్విక్ కంపెనీ చేజిక్కించుకుంది. దీంతో ఆదినారాయణరెడ్డి, ఆయన వర్గం వారు జీర్ణించుకోలేకపోతున్నారు. తాను శాసన సభ్యుడిగా ఉన్న నియోజకవర్గంలో మరొకరు వచ్చి కోట్లాది రూపాయలు పను లు చేయడం ఏమిటని మదన పడుతున్నారు. ఎలాగైనా రిత్విక్ కంపెనీ ప్రతినిధులను తమ అదుపులోకి తెచ్చుకునే విధంగా గత కొంత కాలంగా గండికోటలో జరుగుతున్న పనులకు స్థానిక నాయకులు అడ్డు తగులుతూ వచ్చారు. దీంతో గండికోట గ్రా మంలో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది.

ఆరు వాహనాల్లో వచ్చారు.. దాడి చేశారు

ఆది వర్గానికి చెందిన వారు ఆరు వాహనాల్లో గండికోటకు వెళ్లి రిత్విక్ కంపెనీపై దాడులు చేశారు. సోమ వారం మధ్యాహ్నం ఆదినారాయణరెడ్డి వర్గీయులు పోలీసుల సమక్షంలోనే దాడులు చేసినట్లు సమాచారం. పోలీసులు ముందుకు రాకండి, ఫొటోలు, వీడియోలు కూడా తీయవద్దు. అంటూ రిత్విక్ కంపెనీపై రాళ్లదాడి చేసి మేనేజర్‌ను సైతం కొట్టారు. మరో ప్రాంతంలో ఉన్న జేసీబీని పగుల గొట్టారు. స్థానికంగా ఉన్న పోలీసులు మేము ఏమి చేయగలం, తమ ప్రాణాలు చిన్నవి అంటూ సెలవిస్తున్నారు. దాడి అనంతరం అర్బన్ సీఐ నరేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐలు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

చెట్లు నరికి అక్రమంగా తరలింపు


శ్రీ రెడ్డెమ్మకొండ పరిసరాల్లో చెట్లను అక్రమంగా నరికివేసి ట్రాక్టర్లలో తరలిస్తున్న అక్రమార్కులు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లె గ్రామానికి సమీపంలోని శ్రీ రెడ్డెమ్మ కొండ పరిసరాల్లో ఉన్న కొండలు, గుట్టలతో పాటు పొలాల్లో పెద్ద ఎత్తున కలపచెట్లు ఉన్నాయి. వీటిపై అక్రమార్కుల కన్నుపడింది. కన్నుపడిందే తడవుగా చెట్లను అక్రమంగా నరికివేసి ట్రాక్టర్ల ద్వారా బయట మండలాలకు తరలించుకుపోతున్నారు. గత పదిహేను రోజులుగా ఈ తంతు సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొంతమంది బయట మండలాలకు చెందిన వ్యాపారులు ఇక్కడే మకాం వేసి ఇష్టానుసారం కలపచెట్లను నరికి అక్కడే కుప్పలుగా వేస్తున్నారు. కట్టెలు ఎక్కువగా సేకరించి ట్రాక్టర్ల ద్వారా బయట మండలాలకు తరలిస్తున్నారు. ఎంతో విలువైన వృక్షసంపదను నాశనం చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గ్యాస్ బిల్లుల స్కాంపై సమగ్ర విచారణ జరిపించాలి


జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఏ నాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలలో జరిగే గ్యాస్ బిల్లుల స్కాంపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఏ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటిలోని కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్‌కు ఏఐఎస్ఏ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తూ ప్రభుత్వ ఖజానాను లూటీ చేస్తున్న అవినీతి అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలన్నారు. నీతి నిజాయితీగా విద్యార్థుల సంరక్షణకు పాటుపడే అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ నాయకులు షేక్ రెడ్డి బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని మైదుకూరు రోడ్డులో గల మోర్ సూపర్ మార్కెట్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు సోమవారం మరమ్మత్తులు చేస్తూ ఓ లైన్‌మెన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. పట్టణంలోని మైదుకూరు రోడ్డులో నివసిస్తున్న కె.నాగసుబ్బారెడ్డి 17 ఏళ్లుగా విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మోర్ సూపర్‌మార్కెట్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులకు గురైందన్న ఫిర్యాదు అందుకున్న ఆయన పరిశీలించేందుకు వెళ్లాడు. ఎల్‌సీ తీసుకుని మరమ్మత్తులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే ఆయనతో పాటు ఉన్న జూనియర్ లైన్‌మెన్లు హుటాహుటిన ప్రైవేటు వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

ఆర్టీపీపీలో ఉద్రిక్తత

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో సోమవారం ఏపీఎస్సీ జేఏసీ, టీఎన్‌టీయూసీ, బీఎంఎస్ యూనియన్ల మధ్య తోపులాట జరిగింది. కొంచెం సేపు ఉద్రిక్త చోటు చేసుకుంది. పోలీస్, విజిలెన్స్, ఎస్‌పీఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఇరువురు వర్గాల వారితో మాట్లాడి సర్ది చెప్పారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఏపీ జేఏసీ నిరసనలు, రిలే దీక్షలు చేసి సోమవారం ఫౌంటెయిన్ వద్ద నుంచి ర్యాలీ చేపట్టింది. అదే సమయంలో ప్రభుత్వంలో భాగమైన టీఎన్‌టీయూసీ, బీఎంఎస్ యూనియన్లు కలసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంట్రాక్ట్ కార్మికుల కోసం నిరసనలు చేపట్టి సోమవారం రిలే దీక్షలు ప్రారంభించి గేటు బయట ఆందోళన చేసింది. జేఏసీ ర్యాలీ అనంతరం ఉద్యోగ, కార్మికులు విధులకు వెళ్తుండగా, గేటు బయట టీఎన్‌టీయూసీ, బీఎంఎస్ యూనియన్లు విధులకు పోకుండా అడ్డుకుంది. దీంతో ఒక్కసారిగా జేఏసీ, ఆ రెండు యూనియన్ల మధ్య తొపులాట జరిగింది. ఈ తోపులాటలో జేఏసీకి చెందిన ఓ ఉద్యోగి చొక్కా చినిగింది. అక్కడే ఉన్న పోలీసులు సర్దిచెప్పారు. అనంతరం జేఏసీ నాయకులు ఆర్టీపీపీ సీఈ ని కలిసి వినతి పత్రం అందించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


నూర్పిడి యంత్రాలను ప్రారంభిస్తున్న ఏపీజీబీ అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రైతులకు వ్యవసాయ పని ముట్లకు రుణాలను ఇస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రాజంపేట రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్ స్వరూప్, కడప ఆర్ఎం శ్రీనివాస ప్రసాద్, ఎల్‌డీఎం జనార్దనం తెలిపారు. సోమవారం కడపలోని జాన్‌డీర్‌లో నర్సిరెడ్డి, శివకుమార్‌లకు నూర్పిడి యంత్రాలను అందజేశారు. డీఆర్‌పీ డీపీఎం రఘునాథరెడ్డి, రాజంపేట ప్రాంతీయ కార్యాలయ సీపీసీ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నిమిషాల్లోనే చంపేశారు

- హైదరాబాద్‌కు చెందిన కిరాయి హంతకుల చేతిలో హతమైన ఫైనాన్షియర్
- బాకీ దారుల ఆస్తుల అటాచ్ కోసం కోర్టులో కేసు వేసిన వేణుగోపాల్‌రెడ్డి
- ఆ కోపంతోనే హత్య చేయించిన బాకీ దారులు


వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : వడ్డీ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి కిరాయి హంతకుల చేతిలో హతమయ్యాడు. వేణుగోపాల్‌రెడ్డి వద్ద బాకీ తీసుకున్న ఇరువురు వ్యక్తులు హైదరాబాద్‌కు చెందిన కిరాయి హంతకుల ద్వారా అతన్ని చంపించినట్లు తెలుస్తోంది. ప్రొద్దుటూరులోని బొల్లవరం ప్లాట్‌లలో నివాసం ఉంటున్న వడ్డీ వ్యాపారి కొండా వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం రాత్రి హత్యకు గురైన విషయం తెలిసిందే. రెండు రోజుల గాలింపు చర్యల అనంతరం రూరల్ పోలీసులు ఆదివారం సాయంత్రం అతని మృతదేహాన్ని చాపాడు వద్దనున్న కుందు వంతెన వద్ద గుర్తించారు. అగ్నిమాపక శాఖ రెస్క్యూ టీంతో కలిసి రూరల్ పోలీసులు అతికష్టం మీద వేణుగోపాల్‌రెడ్డి మృతదేహాన్ని నదిలో నుంచి వెలికి తీశారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం పోలీసులు అతని మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ప్రొద్దుటూరుకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి బంధువు, మరో వ్యక్తి కలసి వేణుగోపాల్‌రెడ్డిని హతమార్చేందుకు కొన్ని రోజుల ముందే వ్యూహ రచన చేశారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌కు చెందిన నలుగురు కిరాయి హంతకులను శుక్రవారం ప్రొద్దుటూరుకు పిలిపించారు. వారు తమ కారును వేణుగోపాల్‌రెడ్డి ఇంటి సమీపంలో ఉన్న ఆర్చి వద్ద ఆపుకున్నారు. అక్కడ వారు ఉన్న సమయంలోనే సాయంత్రం వేణుగోపాల్‌రెడ్డి ఇంటి నుంచి స్కూటీలో పట్టణంలోకి వెళ్లాడు. అదే రోజు రాత్రి సుమారు 8.30 గంటల తర్వాత ఇంటికి బయలుదేరాడు. ఇంటి సమీపంలో ఉన్న ఆర్చి దాటగానే కారులో ఉన్న కిరాయి హంతకులు అతన్ని ఆపినట్లు తెలిసింది. ఎవరు మీరు అని అడిగే లోపే వారు వేణుగోపాల్‌రెడ్డిని కొట్టడంతో కింద పడిపోయాడని, ఈ క్రమంలోనే దుండగులు కాళ్లతో గొంతు నులిమి చంపేసినట్లు విశ్వసనీయ సమాచారం. 'నన్ను చంపొద్దు.. మీకు ఏం కావాలో చెప్పండి ఇస్తాను' అని బతిమాలుకున్నా దుండగులు కనికరించలేదని తెలిసింది. వేణుగోపాల్‌రెడ్డి స్కూటీలో అక్కడికి రావడం, వారు హత్య చేయడం ఇదంతా రెండు, మూడు నిమిషాల్లోనే జరిగినట్లు తెలుస్తోంది. కాగా ఫైనాన్స్ వ్యాపారి చనిపోయాడని నిర్ధారణ చేసుకున్న దుండగులు మృతదేహాన్ని అదే కారులో వేసుకొని దువ్వూరు దారిలోని కామనూరు బ్రిడ్జి వద్ద కుందు నదిలో పడేసి అదే రాత్రికి హైదరాబాద్‌కు వెళ్లిపోయినట్లు పోలీసు వర్గాల సమాచారం. తర్వాత నిందితులు హైదరాబాద్‌లో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిచ్చిన సమాచారంతోనే కుందు నదిలో ఉన్న వేణుగోపాల్‌రెడ్డి మృతదేహాన్ని పోలీసులు గుర్తించి వెలికి తీశారు.

నిందితుల్లో వేణుగోపాల్‌రెడ్డి భార్య తరపు బంధువు కూడా..

వేణుగోపాల్‌రెడ్డిని హతమార్చిన వారిలో అతని భార్య సమీప బంధువు ఒకరు ఉన్నట్లు తెలిసింది. కాగా 2016లో నిందితుల్లోని ఒక వ్యక్తితో గొడవ జరిగింది. వేణుగోపాల్‌రెడ్డి డబ్బు అడగటానికి వెళ్లగా అతను దాడి చేశాడు. దీంతో వేణుగోపాల్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో రెండేళ్ల క్రితం వీరి మధ్య రాజీ కుదిరింది. కాగా నిందితుల్లోని ఇద్దరు వ్యక్తులకు వేణుగోపాల్‌రెడ్డి రూ. లక్షల్లో బాకీ ఇచ్చాడు. ఈ డబ్బు గడువు ముగిసినా వారు ఇవ్వకపోవడంతో ఫైనాన్షియర్ కోర్టులో కేసు వేశాడు. అంతేగాక కొంత కాలం తర్వాత వారి ఆస్తులు అటాచ్ కోరుతూ ఫైనాన్షియర్ మరో మారు కోర్టును ఆశ్రయించాడు. ఇది ఇరువురు బాకీ దారులకు ఆగ్రహాన్ని కలిగించింది. ఈ విషయమై పలువురు వేణుగోపాల్‌రెడ్డికి నచ్చచెప్పినట్లు తెలిసింది. అయినా కూడా అతను ఆస్తుల అటాచ్ విషయంలో వెనక్కి తగ్గలేదు. ఈ కారణంతోనే ఇద్దరు కలిసి హైదరాబాద్‌కు చెందిన నలుగురు కిరాయి హంతకులతో వేణుగోపాల్‌రెడ్డిని హతమార్చినట్లు సమాచారం. కాగా కేసులోని ప్రధాన నిందితులు, కిరాయి హంతకులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. వారిని పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఈ కేసులో ఇంకెవరికైనా ప్రమేయం ఉందా అనే కోణంలో ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.